నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (19.06.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్నివార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 9849907885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

సిపిఎం ఇంటింట సర్వే...

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలి

- సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఇతరాత్ర పేర్లతో ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు డిమాండు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరుల వేసిన విద్యుత్‌చార్జీల బాదుడపై ఆదివారం తిరుపతి నగరంలో ఇంటింట సర్వే చేపట్టారు. సుందరయ్య నగర్‌లోని ఇంటింటికి వెళ్లి గతంలో వారికొచ్చిన కరెంట్ చార్జీ, మే నెలలో వారికి వచ్చిన విద్యుత్ బిల్లుపై ఆరా తీశారు. ప్రతి ఇంటిలోనూ ఏప్రిల్ నెలకంటే మే నెలలో రెండు, మూడు రెట్లు అధికంగా రావడాన్ని గమనించారు. ప్రజలు తాము ఈ భారాలను మోయలేకపోతున్నామని, కరెంట్ బిల్లు కట్టేందుకు ఉన్న ఇంటినే అమ్మేయాల్సిన పరిస్థితి వస్తోందని సిపిఎం నాయకుల ఎదుట తమ ఆవేదన వెలబోశారు. దీనిపై స్పందించిన మాజీ ఎంపి మధు మాట్లాడుతూ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా భారాలను మోపడం బాధాకరమన్నారు. ఒక లైట్, ఒక ఫ్యాన్ ఉన్న ఇంటికి గతంలో 200 నుంచి 300 రూపాయల లోపు కరెంట్ బిల్లు వస్తే, జూన్‌లో 1258 రూపాయలు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తమ సర్వేలో ప్రతి ఇంటి వద్ద బిల్లులను చూపుతూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. గత 10 సంవత్సరాల బిల్లులు ఒకేసారి మోపారని విమర్శించారు. ఈ బిల్లులు చెల్లించడం వినియోగదారులకు సాధ్యం కావడం లేదన్నారు. జగన్ ప్రభుత్వం కరెంట్ బిల్లులను ట్రూఆప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు ఇతరాత్ర పేర్లతో రెండు నుంచి మూడు రెట్లు పెంచేసిందన్నారు. అసలు బిల్లులు రూపొందించడంలో కూడా మోసం దాగుందన్నారు. అరియర్స్ పేరు చెప్పి అదనపు బిల్లులు వసూళ్ల చేస్తున్నారని, వినియోగదారులు ఈ దారుణాన్ని తట్టుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రోజు కేవలం ఒక కాలనీలోనే వినియోగదారులు పరిస్థితి ఇంత బాధాకరంగా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తిరుపతి నగర వాసులు విద్యుత్ ఛార్జీల బాదుడపై పడుతున్న ఆవేధనను గమనించిన సిపిఎం సోమవారం తిరుపతిలోనే వినియోగదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులందర్ని ఏకం చేసి జెఏసి ఏర్పాటు చేసి, ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నిరు. ఇప్పటికైన ప్రభుత్వం దిగివచ్చి పెంచిన చార్జీలను ఉపసంహరించాలని డిమాండు చేశారు. లేని పక్షంలో బారీ నిరసనలు తప్పవని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో వినియోగదారుల కడుపమంట బయటపడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సంక్షేమం అందిస్తే ఇలా ఉంటుందా అని ఎద్దేవా చేశారు. 2015 నుంచి 19వ వరకు ట్రూప్ ఆఫ్ చార్జీలు మోపారని, ఇప్పుడు మళ్లీ అదనపు భారం వేయడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసగా వినయోగదారులకు సిపిఎం అండగా ఉంటూ, పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి కందారపు మురళీ, సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, వేణు, నాగార్జున, జయచంద్ర, ఆర్.లక్ష్మీ, సాయిలక్ష్మీ, నరేంద్ర, జయంతి, మాదవ్, బుజ్జమ్మ, గంగులప్ప, మునిరాజా, రమేస్, చినబాబు, లక్ష్మీదేవమ్మ, రాజా, సోము పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు, నాయకులు

చిన్నగదికి రూ.1200లు..

పట్టుమని పది అడుగుల విస్తర్ణం కూడా లేని చిన్నగదికి రూ.1200లు విద్యుత్ బిల్లులు వేయడం శోచనీయం. సుందరయ్య నగర్‌లోని డోర్ నెంబరు 19.6.42 గల చిన్న ఇంటిలో మల్లికార్జున తన కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఈ ఇంటికి రూ.350లు విద్యుత్ బిల్లు వచ్చేది. ఈనెల 1258 రూపాయలు రావడం గమనార్హం. లలిత అనే ఆమె నివశించి రేకుల షెడ్‌లో ఒక ప్యాన్, లైటు, టివి మాత్రమే ఉన్నాయి, దీనికి నెలకు 300 రూపాయలు మించకుండా బిల్లు వచ్చేది. ఈ నెల ఏకంగా 800 రూపాయలు వేశారు. లక్ష్మీ అనే మహిళా స్థానికంగా బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె సమీపంలో ఓ చిన్న గదిలో ఉంటోంది. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమె ఇంటిలో ఉండదు.. రోడ్డు పక్కన బట్టలు ఐరెన్ చేసుకుంటుంది. రాత్రి పూట మాత్రం పడుకునేందుకు ఇంటికి వస్తుంది. ఈ ఇంటిలో ఒక ప్యాన్, లైట్ మాత్రమే ఉన్నాయి. గతంలో ఈ ఇంటికి 200 రూపాయలకు లోపే కరెంట్ బిల్లు వచ్చేది. ఈ నెలలో రూ.1028 రావడం విస్మనియం. ఇలా ఒకటి, రెండు కాదు. కాలనీలోని అన్ని ఇళ్లకు గతంతో పోల్చితో రెండు నుంచి మూడు రెట్లు అధికంగా మే నెల విద్యుత్ బిల్లుల రావడం విడ్డూరం.

జేఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా సెకండ్ ర్యాంక్ సాధించిన శశాంక్

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం

ప్రజాశక్తి- పలమనేరు: జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన విద్యార్థి బి.శశాంక్ ఆల్ ఇండియా సెకండ్ ర్యాంక్ సాధించారు. శశాంక్ తండ్రి గణేష్ యాదవ్, తల్లి సునీతలు శశాంక్‌కు ఆల్ ఇండియా స్థాయిలో సెకండ్ ర్యాంక్ రావటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. శశాంక్ తండ్రి గణేష్ యాదవ్ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త గాను, నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకంటూ గుర్తింపును పొందారు. శశాంక్ తల్లిదండ్రులు మాట్లాడుతూ... చదువులో ఎప్పుడు ముందుండేవాడని, ఒకటి నుండి 5వ తరగతి వరకు శ్రీచైతన్య బెంగళూరులో చదివాడని తెలిపారు. 6,7 తరగతులు బీజీఎస్ స్కూల్ బెంగళూరు, 8,12 తరగతులు నారాయణ కాలేజ్ బెంగళూర్‌లో విద్యను అభ్యసించారని తెలిపారు. తమ కుమారుడు శశాంక్‌కు ప్రత్యక్షంగా, సోషల్ మాధ్యమాలలో శు భాకాంక్షలు, ఆశీస్సులు అందజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం.. : శశాంక్

జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ర్యాంకు సాధించడానికి తల్లిదండ్రులతోపాటు అధ్యాపకుల కషి ఎంతో ఉంది. ప్రతి విద్యార్థికి తనకంటూ ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది. అది తెలుసుకొని అటువైపు వెళ్తే సక్సెస్ అవుతారు. అలాగే కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ గురించి తెలుసుకోవడం అవసరమే. ఏ పోటీ పరీక్షలోనైన కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఉంటేనే రాణించగలుగుతారు.

తల్లిదండ్రులతో శశాంక్

గ్రిల్‌వర్క్ కార్మికులకు గుర్తింపు కార్డులందిస్తాం..

మున్సిపల్ ఛైర్మన్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి- పుంగనూరు: గ్రిల్‌వర్క్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ అలీమ్‌బాష తెలిపారు. గ్రిల్‌వర్క్ కార్మికుల సమావేశం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఛైర్మన్ మాట్లాడుతూ గ్రిల్‌వర్క్ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు అందిస్తామని, అలాగే కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. కార్మికులకు అందరికీ రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో పదుల సంఖ్యలో గ్రిల్‌వర్క్ కార్మికులు ఉన్నారని వీరు ఎల్లప్పుడూ కరెంటు వద్దనే పనిచేస్తుంటారని పలు జాగ్రత్తలు తీసుకుని మీ విధి నిర్వహణలో ఉండాలన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రిల్ వర్క్ కార్మికుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా కెఎస్.బాషు, ఉపాధ్యక్షులుగా జీర్, కార్యదర్శిగా పి.రియాజ్, సహాయ కార్యదర్శిగా రజి, కోశాధికారిగా అమనుల్ల, కమిటీ సభ్యులు ఖలీల్, ఇమ్రాన్, సమీ, ఈశ్వర్ రాజు, రియాజ్ నూర్‌ను ఎన్నుకోవడం జరిగింది.

ర్యాంపుల వల్లే మామిడి ధర తగ్గింపు

ఏఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ర్యాంపు వల్లనే మామిడి ధరలు తగ్గిస్తున్నారని ఏఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏఎంసిలో ఆయన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారి సభ్యులకే ర్యాంపులు ఉన్నాయని, వారి వద్దకు వెళ్లే మామిడి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారని, వారు నిర్ణయించిన ధరలకు మామిడి విక్రించే విధంగా రైతులను మోసగిస్తున్నారని ఆరోపించారు. యార్డుకు వచ్చిన మామిడి కాయల 12 రూపాయలు నుండి 20 రూపాయల వరకు ఉందని మామిడికాయల్లో మచ్చలగల కాయలకు మార్కెట్ యార్డ్‌లో ధరలు లేవని వాటిని చూపించి ప్రభుత్వంపై నింద మోపుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వంపై అంబాండాళ్లు మానుకొని నిజాలు తెలుసుకొని మామిడి రైతులకు సహకరించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కరోనా జాగ్రత్తలు మరవద్దు : డిసిహెచ్‌ఎస్ బిసికె.నాయక్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో మినహా ఎండ త్రీవత ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు రావడం శ్రేయస్కరం కాదని డిసిహెచ్‌ఎస్ బిసికె.నాయక్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రోజువారి దినచర్యలో వేసవి కాలంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. రోజుకు 5 నుంచి 7 లీటర్ల సురక్షితమైన నీటికి తీసుకోవడంతో పాటు, సహజసిద్ధమైన శీతల పానీయాలైన నిమ్మరసం, కొబ్బరి నీళ్ళు తీసుకోవడం, తెల్లటి వస్త్రాలను ధరించడం మంచిదని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయట ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తే గొడుగులు ఉపయోగించాలని, వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని, ముందుగా ఓఆర్ఎస్ తాగించి వడదెబ్బ సోకిన వ్యక్తిగా స్వచ్ఛమైన గాలి పీచ్చుకొనేలా ఫ్యాన్ కింద లేదా గాలి సోకే ప్రాంతంలో పడుకోబెట్టాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, పిహెచ్‌సీ, సిహెచ్‌లతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే 108, 104 వాహనాలు, ఏఎన్ఎంలు, ఆశాల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లాలో వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆసుపత్రులు ఎన్ని?

డిసిహెచ్‌ఎస్: వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో 24 ఆసుపత్రులు, 2 ప్రధాన వైద్యశాలలు, 5 ప్రాంతీయ వైద్యశాలతో పాటు 19 సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,700 పడకలున్నాయి. వీటిలో 899 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపి సేవలు పెరిగాయి. ఎక్స్‌రే, యు.యుస్.జి, ఇసిజి, ల్యాబ్ టెస్టులు అందిస్తున్నాము.

ప్రజాశక్తి: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవలు ఎంత మందికి అందించారు?

డిసిహెచ్‌ఎస్: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 3,561 మంది చికిత్సలు సేవలు పొందారు. తల్లిబిడ్డ సంరక్షణ కింద సాధారణ ప్రసవాలు 4,986 సిజేరియన్ ప్రసవాలు, వైఎస్ఆర్ కంటి వెలుగు కింద ఎపివివిపి ఆసుపత్రుల కంటిపరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేసి కంటి అద్దాలు, చిత్తూరు, మదనపల్లి, పలమనేరు, కుప్పం, ఆసుపత్రుల్లో సర్జరీ కంటి పరీక్షలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: నేషనల్ ఫ్రీడయాలసిస్ సెంటర్ ద్వారా అందించే సేవలు ఏమిటి?

డిసిహెచ్‌ఎస్: నేషనల్ ఫ్రీ డయాలసిస్ సెంటర్ 2016లో శ్రీకాళహస్తి, కుప్పంతోపాటు చిత్తూరు, మదనపల్లిలో ప్రారంభించడం జరిగింది. కిడ్ని వ్యాధితో బాధపడేవారు చికిత్స కోసం నెల్లూరు, తిరుపతి వెళ్ళేవారు. ప్రస్తుతం ఉచితంగా కిడ్నీ డయాలసిస్ చేస్తున్నారు. 38 మిషన్లున్నాయి. జనరల్ కేసులకు 1 డ్యూటి మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంటారు. నెలలో 15 రోజులకు ఒకసారి నెఫ్రాలజిస్ట్ స్పెషలిస్ట్ వచ్చి పరీక్షిస్తున్నారు. 2021- 22లో 328 మందికి వ్యాధి నిర్ధారించి చికిత్స అందిస్తున్నాం.

ప్రజాశక్తి: మత్తుపదార్ధల నివారణ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి, వాటి ద్వారా అందిస్తున్న సేవలేమిటి?

డిసిహెచ్‌ఎస్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి చిత్తూరు, మదనపల్లిలో మత్తుపదార్ధలకు బానిసలుగా మారిన వారికి సేవలు అందించడం జరుగుతోంది. 2021- 22లో 2,355 పైగా ఓపీడీ, 74 ఐపిడి కేసులు, ఈ ఏడాదిలో 459 ఓపిడి, 9 ఐపిడి కేసులు చిత్తూరు ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారు. మదనపల్లిలో కూడా ఓపిడి, ఐపిడి కేసులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

ప్రజాశక్తి: సదరం కార్యక్రమం ఎలా నడుస్తోంది?

డిసిహెచ్‌ఎస్: సదరం కార్యక్రమం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు జారీచేయడం జరుగుతోంది. 13ఆసుపత్రుల్లో విభిన్న ప్రతిభావంతులైన వారికి 2018 నుండీ ఇప్పటి వరకు 17,942 మందికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు జారీ చేశాం. అలాగే నాడు-నేడు పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించే పనులు వేగవంతంగా నిర్వహించడం జరుగుతోంది.

సెక్రటేరియట్ ఇంజనీర్స్ కార్యవర్గం ఏకగ్రీవం

సమావేశంలో మాట్లాడుతున్న పిఆర్ ఈడి మహేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసోయేషన్ సెక్రటెరియట్ ఇంజనీర్స్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా వీఆర్‌వో సంఘం అధ్యక్షులు బాలాజీరెడ్డి, ఏపి జేఏసి అమరావతి పీఆర్‌ఈడీ జిల్లా అధ్యక్షులు మహేష్, డిప్యూటీ తహాశీల్దార్ వంశీకృష్ణ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. మండలస్థాయి, నియోజవర్గస్థాయి ఇంజనీర్స్ అసోషియేషన్ కార్యవర్గం ఎన్నిక తరువాత జిల్లా స్థాయి కార్యవర్గం ఎన్నిక కోసం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించిన్నట్లు వక్తలు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నుకున్న జిల్లా కార్యవర్గం ఇంజనీర్ల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బాలాజీ, ప్రధాన కార్యదర్శి మణిమారన్, అసోషియేట్ అధ్యక్షులుగా గ్రీష్మ, ఉపాధ్యక్షులుగా బాలచంద్ర, భారతి సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్‌రెడ్డి, నాదిమ్ ఆర్ఆహు మహిళా విభాగం నాయకురాలిగా దీపా, టెన్నికల్ సెక్రటరీ ప్రశాంత్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యశ్వంత్ కుమార్, ట్రజర్ బబిత, మీడియా కార్యదర్శిగా దినేష్‌లను ఎన్నుకున్నారు.

ఉన్న రెండు ఎకరాలు లాక్కున్నారు..

మీడియాను ఆశ్రయించిన బాధితుడు

మీడియా ఎదుట వాపోతున్న బాధితుడు నాగభూషణం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆక్రమంలో ఉన్న తన భూమిని తమకు ఇప్పించాలని ఐరాల మండలం పందికొట్టురుకు చెందిన నాగభూషణం మీడియాను ఆశ్రయించారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిగోలం గ్రామ రెవెన్యూలో తమ అనుభవంలో ఉన్న భూమిని నాగరాజు నాయుడు అక్రమంగా ఆక్రమించుకొని మామిడి చెట్లు నాటాడని తెలిపారు. నాగరాజు నాయుడు దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తే తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన భూమిని సర్వేచేసి తనకు అప్పగించాలని అధికారులకు పలుమార్లు వినతి చేసిన పట్టించుకోలేదు వాపోయారు. సర్వే చేయడానికి వస్తే నాగరాజు నాయుడు వారిని అడ్డుకుంటున్నాడని ఉన్నతాధికారులు పట్టించుకోని తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆర్థోపెడిక్ రోగులకు అందుబాటులో 'ఆశ్రయ'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆర్థోపెడిక్ రోగులు వైద్యం కోసం వెలూరు, బెంగుళూరు, తిరుపతి నగరాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేదు. చిత్తూరు నగరంలో ఆశ్రయ మల్టీస్పెలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. 2010లో చిత్తూరు నగరంలో కట్టమంచి అత్యాధునిక భవనంలో ఏర్పాటు చేసిన అశ్రయ ఆసుపత్రి ప్రథమంగా ఆర్థోపెడిక్ డిపార్టమెంట్‌తో ప్రారంభమై 12సంవత్సరాల అనుభవంలో మల్టీస్పెషాలిటీగా రూపుదిద్దకుంది. చిత్తూరు నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోని ఆర్థోపెడిక్ రోగులకు సేవలు అందిస్తోంది. కట్టమంచి కణ్ణన్ కళ్యాణ మండపం ఎదురుగా ల్యాబ్, ఐసియు, ఫార్మసి, అంబులెన్స్ సౌకర్యంతో రోగులకు అత్యాధునిక వైద్యం అందిస్తోంది. డాక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డిచే ఆర్థోపెడిక్ విభాగంలో విరిగిన ఎముకలు, మోకాళ్ళ అరుగుదలకు ఆపరేషన్లు, నడుము నొప్పికి, డిస్క్ సర్జరీలు చేయబడును. షుగర్, బిపి, గుండె, లివర్ జబ్బులకు డాక్టర్ గౌరీప్రియ వైద్యం అందిస్తున్నారు. అలాగే విష జర్వాలకు, పోస్టుకార్డు కాంప్లికేషన్ కేసులకు సంబంధించి అత్యాధునిక వైద్యం అందించబడును. అంతేకాకుండా జనరల్ సర్జరీ కేసులు, ఈఎన్‌టి ఆపరేషన్లు, ప్రసూతి వెట్నరీ సేవలు అన్ని వేళలల్లో అందుబాటులో ఉంటాయి. ప్రతినెలా మొదటి ఆదివారం సూపర్ స్పెషాలిటీ వైద్యులచే యురాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల్లో ఒపిడి వైద్యసేవలు అందించబడతాయి. ఆశ్రయ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులోని సదుపాయాలు

స్పెషాలిటీస్	సదుపాయాలు
1. ఆర్థోపెడిక్స్	1. ఆపరేషన్ థియేటర్
2. జనరల్ మెడిసన్	2. డెలివరి రూమ్స్
3. జనరల్ సర్జరీ	3. అల్ట్రాసౌండ్ స్కానింగ్
4. గైనకాలజీ	4. ఇసిజి , బిపాప్
5. ఈఎన్‌టి	5. ఎక్స్‌రే
6. యూరాలజీ	6. పార్మసి
7. న్యూరాలజీ	7. అంబులెన్స్
8. గ్యాస్ట్రోఇంటిరాలజీ	8. ల్యాబ్
9. దయాబెటాలజి	9. అడ్మిషన్ సౌకర్యం

ఆశ్రయ ఆసుపత్రి నందు ఏసి గదులు, జనరల్ వార్డు, ఐసియు డిలక్స్ గదులు అందుబాటులో కలవు.

24 గంటలు రోగులకు అందుబాటులో

'ఇందిరా హాస్పిటల్'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 24 గంటలు ఎమర్జెన్సీ, దయాబెటిక్ రోగులకు చిత్తూరు గాంధీ రోడ్డులోని ఇందిరా హాస్పిటల్ అందుబాటులో ఉంటోంది. దయాబెటిక్ రోగుల కోసం చిత్తూరు అనుభవం కలిగిన వైద్యులచే వైద్యం అందిస్తున్నారు. డాక్టర్ లివిజ జనరల్ ఫిజిషన్ అండ్ దయాబెటాలజిస్ట్ ఎస్ఆర్ అపోలో చిత్తూరు, డాక్టర్ జి.సురేష్ జనరల్ ఫిజిషియన్ అండ్ ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ నిపుణులు 24/7 అందుబాటులో ఉంటారు. చిత్తూరు నగరంతో పాటు పరిసర మండలాల్లోని దయాబెటిక్ పెషెంట్లు, ఎమర్జీసీ సేవల కోసం ఇందిరా ఆసుపత్రిని ఆశ్రయించవచ్చు.

ఇందిరా ఆసుపత్రిలోని వైద్యసేవలు..

1. షుగర్‌వ్యాధి, రక్తపోటు (బిపి) థైరాయిడ్.
2. జ్వరం (మలేరియయ, డెంగ్యూ, టైఫాయిడ్, కోవిడ్)
3. పాయిజన్ కేసులు, పాముకాటు, తేలుకాటు, కుక్కకాటు.
4. బర్న్స్, వడదెబ్బ, అలసట, నీరసం
5. అన్ని రకాల గుండె సంబంధిత వ్యాధులు (ఛాతినొప్పి గుండెపోటు, గుండెదడ, హార్ట్‌ఫెయిట్యూర్)
6. అన్ని రకాల కాలేయం, కడుపు, ప్లీహం, ప్రేగు సంబంధిత వ్యాధులు.
7. తలనొప్పి (మైగ్రెయిన్) పక్షవాతం, తల తిరగడం, మూర్ఛవ్యాధి, నరాల బలహీనత, స్పృహకోల్పోవటం, అరికాళ్ల మంటలు.
8. దీర్ఘకాలిక నొప్పులు (ఆర్థ్రైటిస్, మెడనొప్పి, నడుం నొప్పి, స్పాండైలోసిస్)
9. రక్తహీనత, కామెర్లు, బ్లడ్‌ట్రాన్స్‌ఫ్యూషన్
10. అన్ని రకాల చిన్నిపిల్లల జబ్బులు చూడబడును.
11. ఓబిజికేసులు (పిసిఒడి, అధిక రక్తస్రావం, గర్భకోశ ఇన్ఫెక్షన్, గర్భపరీక్షలు)
12. చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్స్

పేదలకు నిస్వార్థంగా లైన్స్‌క్లబ్ సేవలు

ప్రజాశక్తి -పుంగనూరు: పేదప్రజలకు నిస్వార్థంగా సేవలు ఎల్లవేళలా లైన్స్‌క్లబ్ ద్వారా అందిస్తున్నామని లయన్స్ సంస్థ డిస్ట్రిక్ట్ అంబాసిడర్, ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ శివ అన్నారు. పట్టణ లైన్స్‌క్లబ్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో 2023 24 సంవత్సర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానంతో కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఫర్ ఎన్విరాన్ మెంట్ వరదా రెడ్డి కమిటీ నిర్ణయం మేరకు 2023 జులై 1వ తారీఖు నుండి 2024 జూన్ 30 వరకు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు తెలిపారు. ఇందులో ఏకగ్రీవంగా అధ్యక్షుడి ఎస్.త్రిమూర్తి రెడ్డి, కార్యదర్శి అమరావతి సురేష్ కుమార్, కోశాధికారి కొత్వాల్ రజి అహ్మద్, మొదటి వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీధర్, రెండవ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రావు ఎంపికయ్యారు. అతి త్వరలో వీరు పుంగనూరు లయన్స్‌క్లబ్ ఆఫ్ నోబెల్ ద్వారా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లా డుతూ పుంగనూరు ప్రజలకు ఇది వరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాలసిస్ సెంటర్, కంటి వైద్య శిబిరం,హెల్త్ క్యాంప్ వంటి వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలతో పాటు రానున్న రోజుల్లో అన్నదాన కార్యక్రమాలలో భాగంగా నూతనంగా పేదలకు అందుబాటులో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు, విద్య-వైద్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రక్తదాన శిబిరాలు, నీడ్ టూ హెల్ప్‌లో భాగంగా క్లాత్ బ్యాంక్ తదితర అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎన్నికైన కమిటీ సభ్యులను పుంగనూరు ప్రముఖులు, నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర బీసీ సాధికార కమిటీ మెంబర్‌గా శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ యాదవ్ టిడిపి రాష్ట్ర బీసీ సాధికార కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జిల్లా యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీధర్ యాదవ్ రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా నియామకం కావడంపై, ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు పదవి కట్టబెట్టిన కేంద్ర టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి, జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చంనాయుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు, జిల్లా టీడీపీ అధ్యక్షులు నానికి, నియోజకవర్గ టిడిపి నేతలకు శ్రీధర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా వ్యాప్తంగా పర్యటించి బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలతో గ్రామాలు పర్యటించి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు తెలియజేసి, టిడిపి ఇచ్చిన మేనిఫెస్టోను వివరించి బీసీ సామాజిక ప్రజలు టిడిపి వైపు మళ్ళీ రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తానని శ్రీధర్ యాదవ్ తెలియజేశారు.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూన్ 22వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు జూన్ 24 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు ఆవరణంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండే షన్ ఆధ్వర్యంలో పిఈఎస్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండల వ్యాప్తంగా సుమారు 110 మంది పైగా రోగులు హాజరై ఈ అవకాశాన్ని వినియో గించుకున్నారు. ఇందులో 30మంది కంటి ఆపరేషన్ కోసం ఎంపికయ్యారు. మహతి ఫౌండేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజానికి మంచి చేయా లనే సేవా దక్పథంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. చికిత్సలు కోసం హాజరైన మండల వృద్దులకు అన్నదానం ఏర్పాటు చేసారు. ఆపరేషన్ కోసం ఎంపికైనవారు చికిత్సలు అనంతరం వరకు అన్ని ఉచితంగా అందిస్తున్నట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. డాక్టర్ సంజనా, సిబ్బంది, చీలంపల్లి సుబ్రమణ్యం, బైరెడ్డిపల్లి రవి, సరవనన్న, నాని పాల్గొన్నారు.

మామిడి ధరపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బంగారుపాల్యం: మామిడి ధరపై ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జ్ మురళీమోహన్ అన్నారు. ఆదివారం మార్కెట్ కమిటీ వద్ద మామిడి ధరలపై మండల తెలుగుదేశం అధ్యక్షులు జయప్రకాష్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర రైతులకు రావడంలేదని కనీస మద్దతు ధర రూ.20లు చెల్లించాలని జిల్లా కలెక్టర్ తెలిపారని కానీ మామిడి పది రూపాయలలోపే ధర పలుకు తుందన్నారు. దీనివల్ల మామిడి రైతులు ఆరుగాలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి పలు సంక్షేమ పథకాలు బటన్ నొక్కినట్లుగానే మామిడి రైతుల కోసం ప్రత్యేకంగా బటన్ నొక్కే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మాజీ జెడ్పిటిసి వెంకటేశ్వర చౌదరి సర్పంచ్ కోక ప్రకాశ్ నాయుడు, తెలుగుదేశం నాయకులు ధరణి, శ్రీనివాసులు, కోదండ యాదవ్, రాధిక చంద్రయ్య, పలువురు మామిడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యసాధనపై సమీక్ష

ప్రజాశక్తి - గుడిపల్లి: కుప్పం మండల అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో క్షత్రియ అభివృద్ధికి సంబంధించి చంద్రబాబు నాయుడుకి లక్ష మెజా రిటీ లక్ష్యసాధన కోసం మొదటి సమీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన మధ్య చిచ్చుపెట్టి తెలుగుదేశం పార్టీపై క్షత్రియుల విశ్వాసం దెబ్బతినేలా మన ఐక్యతను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించే కొంతమంది స్వార్థపరులకు బుద్ధి చెప్తూ, లక్ష ఓట్లు మెజారిటీ సాధించడానికి నిర్విరామంగా స్వయ శక్తుల ప్రయత్నించాలన్నారు. మన కులం వారికి పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చిన పదవుల అనుబంధ విభాగాల్లో పార్టీ గుర్తించిన అన్ని రకాల పదవులకు న్యాయం చేయడం, మన ముసుగులో వారి నాయకత్వాన్ని షో చేసుకుంటున్న వారిని అనచడం వంటి అనేక అంశాలపై చర్చించి ఒక స్పష్టమైన భవిష్యత్ కార్యచరణ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. మన కులం వారు ఐక్యమత్యంగా ఉంటూ చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనగా పరిచేయాలని ఈ సందర్భంగా ప్రణాళికలు రూపొందించారు. లక్ష ఓట్లు మెజారిటీ తెప్పించడానికి ఎవరు అడ్డుపడినా ఎవరు ఎన్ని విధాలుగా ఆటంకాలు సృష్టించిన వారికి సరైన శాస్తి చెప్తూ ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ వన్నె, అగ్నికుల క్షత్రియులు పాల్గొన్నారు.

మైనార్టీ సెక్రెటరీ సెల్ అధ్యక్షులుగా సయ్యద్ ఖలింగౌస్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: జెడ్పిటిసి కేశవులు ఆదేశాల మేరకు ఆదివారం తీర్థం గ్రామ నివాసి అయిన సయ్యద్ ఖలీం గౌస్‌ను వైఎస్ఆర్ పార్టీ మండల మైనార్టీ సెక్రటరీ సెల్ అధ్యక్షులుగా ఆదివారం ఎంపిక చేశారు. ఎంపికైన సయ్యద్ ఖలిం గౌసును వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, తీర్థం ఎంపీటీసీ తనయుడు కేశవులు, మండల మైనార్టీ సోదరులు సయ్యద్ కలీం గౌసును అభినందించినట్లు జెడ్పిటిసి కేశవులు తెలిపారు.

జాతీయ స్థాయి కథల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి -పలమనేరు : మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఔత్సాహిక రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నామని ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మలిశెట్టి శ్యామ్ ప్రసాద్, పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బహుమతి పొందిన కథలతో బాటు మరి కొన్ని ఎంపిక చేసిన కథలతో "కథా ప్రపంచం 2023" పుస్తకం ప్రచురించబడుతుందని కథల్లో నవ్యత, సజన కలిగిన కథలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి: రూ.5 వేలు, ద్వితీయ బహుమతి:రూ3 వేలు, తృతీయ బహుమతి:రూ.2 వేలు అని, కథలు చేరడానికి చివరి తేదీ జూలై 15, 2023 అని తెలిపారు. కథల నిడివి డిటిపి చేసినట్లయితే పిడిఎఫ్ ఐదు పేజీలకు మించకుండా లేదా స్పష్టమైన చేతి రాతలో, కొట్టివేతలు లేకుండా 10 పేజీలకు మించకుండా హామీపత్రం, రచయిత పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ సహా కథలను పలమనేరు బాలాజీ, పలమనేరు రచయితల సంఘం, 6/219 గుడియాత్తం రోడ్, పలమనేరు 517408, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పంపాలని తెలిపారు. ఏ ప్రాంతంలోని తెలుగువారైనా ఈ కథల పోటీలో పాల్గొనవచ్చునని, అనువాద రచనలు, అనుసరణలు, ఇతర పోటీలలో ఇప్పటికే పరిశీలనలో ఉన్న కథలను పంపరాదని, గతంలో మలిశెట్టి సీతారాం స్మారక కథల పోటీలకు కథలు పంపిన వారు, బహుమతులు పొందిన వారు కూడా ప్రస్తుత కథల పోటీలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. వివరాలకు: యుగంధర్ 93947 82540, శాస్త్రి 88857 62720 నెంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

ఆకట్టుకున్న దుర్యోదన వధ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి మహా భారతంలో ఆదివారం చివరి రోజు సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. మధ్యాహ్నం అంగరంగ వైభవంగా దుర్యోధనవధ కార్యక్రమం చేపరులను ఆకట్టుకుంది. భీమా దుర్యోధనుల యుద్ధ సన్నివేశాలు, దుర్యోధనుని బొమ్మ మట్టితో చేసి, రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈ బొమ్మ మీద జరిగిన యుద్ధఘట్టం చూడముచ్చటగా ఉంది. సాయంత్రం 7:00 పైన అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ధర్మకర్తలు కార్యనిర్వాహకులు స్థానికులకు, భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చూశారు.

ఘనంగా గంగమ్మ జాతర



ప్రజాశక్తి - పలమనేరు : పలమనేర్ మండలంలోని మండపేటలో గంగమ్మ జాతరను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మ జాతరకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్ నాయుడు, నాగరాజు రెడ్డి, స్వతంత్ర బాబు, వెంకటముని రెడ్డి, గిరి, వాసు, పట్టణ నాయకులు ఆర్బిసి కుట్టి, గిరిబాబు, మోహన్, శీనా, సుబ్బు, గంగవరం నాయకులు గిరిధర్ గోపాల్, అశోక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

టీడీపీ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి- నగరి: హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో మరో చీకటిరోజు అని ఈ వైసీపీ పాలనలో జరుగుతున్న ఆకృత్యాలను చూసి తెలుగుప్రజలు మరోసారి తలవంచు కున్నరోజు అని అభివర్ణించారు. రాష్ట్ర టీడీపీ ఆదేశాల మేరకు చెరుకుపల్లి మండలం, రాజోలు పంచాయతి పరిధిలోని ఉప్పలవారిపాలెం గ్రామంలో బీసీ సామాజికవర్గానికి చెందిన తండ్రిలేని నిరుపేద కుటుంబంలో 10వ తరగతి చదువుతున్న సోదరుడు ఉప్పల అమర్నాథ్ పై పెట్రోల్ పోసి కాల్చి చంపిన ఘటనను తీవ్రంగా నిరసిస్తూ హంతకులపై కఠిన చర్యలు తీసు కోవాలని నగరి నియోకుటుంబంలోని నగరి పట్టణం టవర్ క్లాక్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, చిత్తూరు జిల్లా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జ్యోతి నాయుడు, దేశమ్మగుడి మాజి ఛైర్మన్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఖాదర్ బాయ్, జిల్లా కార్యదర్శి రొక్కం బాలజి, మాజీ ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, రాష్ట్ర బిసి సాటకార సమితి సభ్యులు యస్.యస్.కుమార్, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి అల్లి ముత్తు, నియోజకవర్గ యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

ఏపీ రైతు సంఘం

ప్రజాశక్తి -పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను నట్టేట ముంచిందని మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తుపల్లి జనార్ధన్ పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించిన మద్దతు ధర కిలో రూ.19 తోతపురికి కల్పించకపోవడం దారుణం అన్నారు. మార్కెట్లో వ్యాపారులు, గుజ్జు యజమానులకు గిట్టుబాటు ధరకు కొనని ఎడల ప్రభుత్వమే ధరల స్థిరీకరణ నిధి నుండి నిధులు కేటాయించి రూ.20లు చొప్పున కొను గోలు చేసేలా చూడాలన్నారు. గతంలో ధరలు పడిపోయిన సందర్భం గా 2019లో కిలోకు రూ 2.50 రాయితీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో ఉప ముఖ్యమంత్రి, ఇద్దరూ మంత్రులు ఉన్న మామిడి ఎగుమతులు చేసే విషయంలో గానీ గిట్టుబాటు ధర కల్పించే విషయంలో పట్టించుకోక రైతాంగాన్ని ఇబ్బందులు పాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించి గిట్టుబాటు ధర కల్పించుకుంటే జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నేతలు నాగరాజు, జయరాం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు సన్మానం

ప్రజాశక్తి శాంతిపురం: మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివిన చందన అనే విద్యార్థిని జిల్లాస్థాయి లో ఉత్తమ ఫలితాలు సాధించిన కారణంగా ఆమెను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆదివారం సన్మా నించారు. జిల్లాలో మొదటి స్థానాన్ని పొందిన చందనకు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పార్లమెంట్ సభ్యులు రెడ్డప్ప, జిల్లా పాలన అధికారి షణ్మోహన్, జిల్లా విద్యాధికారి విజయేంద్రల చేతుల మీదుగా రూ.50 వేలు నగదు బహుమతిని చెక్ రూపంలో అధికారులు అందజేశారు. కుప్పం నియోజకవర్గ స్థాయిలో హారిక అనే 10వ తరగతి విద్యార్థినికి ఎమ్మెల్సీ భరత్, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జ్ఞాపిక, అభినందన పత్రం, నగదు బహుమతిని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.డి.కె.వి లత, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బందం, పాఠశాల కమిటీ ఛైర్మన్, మంజునాథ్ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు



ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సద్వినియోగ పరచడమే జగనన్న లక్ష్యమని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం బందార్లపల్లి పంచాయతీ నర్నల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్సీకి విన్నవించారు. వీధి దీపాలు, డ్రైనేజీలు, రేషన్ కార్డులు ,పింఛన్లు, ఇంటి స్థలాలు, నిర్మాణాలు తదితరు సమస్యలను వెంటనే పరిష్కరించి అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కషి చేస్తామన్నారు. వైకాపా పాలనలో ఎవరూ అసంతప్తి చెందకుండా విరివిగా అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విపక్ష నాయకుల వాగ్దానాలను ప్రజలు నమ్మరన్నారు. జగనన్న నాయకత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి నాడు- నేడు పనుల ద్వారా నూతన భవనాలు, విద్యార్థులకు విద్యాసామాగ్రి అందించిన ఘనత వైసిపి కే దక్కుతుందన్నారు. అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 95 శాతం అన్నిటిని అమలు చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి ,ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ రాజగోపాల్, ఎంపీటీసీ సౌమ్య, నేతలు రామకష్ణారెడ్డి, హేమచంద్రారెడ్డి, సుగుణప్ప ,శ్రీనివాసులు, రవి రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శ్రీ వర్ధన్, ఎంపీడీవో రాధాకష్ణ, ప్రభుత్వ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీలపై జగన్‌మోహన్‌రెడ్డికి కక్ష

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీసీల ఓట్లు దండుకొని అధికారం చేపట్టిన తరువాత నుండి వారిపై కక్ష కట్టిన ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన వంద సంక్షేమ పథకాలను రద్దు చేసి, రూ.34 వేల కోట్ల బీసీ నిధులను దారి మళ్లించిన వైఎస్ జగన్ బీసీ ద్రోహిగా చరిత్ర కెక్కారని ఉమేష్ ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లకు కోత కోసి సుమారు 16,800 రాజ్యాంగబద్ధ పదవులను బీసీలకు దూరం చేసి, బీసీల అసైన్డ్ భూములు 8వేల ఎకరాలు బలవంతంగా స్వాధీనం చేసుకున్న ద్రోహి జగన్ అని ఉమేష్ ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్ కు బీసీలు కచ్చితంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: విషం తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్‌పురం గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ షేక్షావలి కథనం మేరకు.. మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన గోవింద స్వామి నాయుడు భార్య కస్తూరి (56)శుక్రవారం రాత్రి పంట పొలానికి ఉపయోగించే విషపు గుళికలను తాగడంతో అస్వస్థతకు గురైంది. భర్త హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. . అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మతిచెందారు. ఈనెల మూడో తేదీన పెనుమూరులో ఓ అమ్మాయి కిడ్నాప్ కేసులో ఈమె కుమారుడు మోహన్ అలియాస్ వాసు అదే గ్రామానికి చెందిన హేమాద్రి బాబు, కొంతమంది స్నేహితులను రిమాండ్ చేయడంతో కొడుకుకి బెయిల్ రాలేదని ఆత్మహత్య చేసుకున్నట్లు గోవిందస్వామినాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఆర్ పురం ఎస్సై షేక్షావలి అన్నారు.

కడుపునొప్పితో యువకుడి...

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొదలపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై షేక్షావలి కథనం మేరకు.. ఎస్ఆర్ పురం మండలంలోని పొదలపల్లి దళితవాడ గ్రామానికి చెందిన గంగయ్య కుమారుడు మనోహర్ 24 గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం కడుపునొప్పి విపరీతం కావడంతో భరించలేక విషపు ఆకులు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే తిరుపతి రుయా హాస్పిటల్ కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మతి చెందాడు. తండ్రి గంగయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఆర్ పురం ఎస్సై షేక్షావలి తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మద్యం సేవించి చిత్తూరు-పుత్తూరు రహదారిపై కొంతమంది వీరంగం సష్టించారు. వైన్‌షాప్ ఎదురుగా పాతపాలెం గ్రామానికి చెందిన కొంతమంది మద్యం సేవించి రహదారిపై వెళ్లే వారిని భయాందోళన గురి చేశారు. పోలీసులు స్పందించి ఇకనైనా చర్యలు తీసుకోవాలి.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలంలోని ముస్లిం మత పెద్దలు ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ షబ్బీర్ ల్లా షా,సర్ ఖలీఫేరెపాయి ఇంటి నుండి ఫకీర్లవారి జోహా ర్లతో, ముస్లిం మత పెద్దలతో బాణ సంచాలతో గంధం వేడుకలు ఊరేగింపుగా స్థానిక దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో ముస్లిం సోదరులు పాలొ ్గన్నారు. హజరత్ సయ్యద్ అహమద్ కబీర్ మాహుఖురఫాయి సున్ని ట్రస్ట్, నూరుల్ హుదా జామియా మసీద్ జమాయత్ గౌసియా కమిటీ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించారు. ఉరుసు కార్యనిర్వాహకులు అజీజ్, ముబారక్ తాజ్ , మున్వర్ బాషా, ఎస్.ఖాజాతాజ్, మత పెద్దలు పాల్గొన్నారు.

బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి-చౌడేపల్లి: దినదినాభివృద్ధి చెంది భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మకు ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకొనేందుకు ఉమ్మడి రాష్ట్రాల భక్తులు తండోపతండాలుగా విచ్చేశారు. అమ్మవారి ఆలయంలో ఆలయ అధికారులు భక్తులకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఎస్.మఠం వద్ద శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వాముల మహాభారత యజ్ఞంలో భాగంగా ద్రౌపది ఆలయ ఆవరణలో ఆదివారం దుర్యోదన వధ ఘట్టం అలరించింది. మహాభారత ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ధర్మరాజుకి పట్టాభిషేకం నిర్వహించారు.

ప్రణాళికతో పనిచేస్తేనే విజయం

ప్రజాశక్తి-క్యాంపస్: ఎన్నికలకు ఎక్కువ సమయం లేదని... ఇకపై పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు మరింత దూకుడు పెంచాలని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రాపురంలో పి.వి.పురం పంచాయితీలో తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివర్తి సుధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 9 నెలల కాలం పార్టీకి అత్యంత కీలకమని, అలసత్వం వీడి పక్కా ప్రణాళికతో పని చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకుల పనితీరుపై ప్రధానంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై ఆయా నాయకులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.